క్లుప్తంగా

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

రాజుపాలెం: మండలంలోని చౌటపాపాయపాలెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర వేపూరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఉదయం ఇంటింటికి తిరిగి సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తారని వెల్లడించారు.

పీఎఫ్‌పై అవగాహన తప్పనిసరి



సత్తెనపల్లి: ప్రావిడెంట్ ఫండ్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ బీవీఎస్ఎస్ఎన్ రాజు అన్నారు. పట్టణంలోని ప్రగతి పాఠశాలలో ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్ పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎఫ్, ఇన్సూరెన్స్ స్కీముల ఉపయోగాల గురించి వివరించారు. సభ్యులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.లీ కార్యక్రమంలో సెక్షన్ సూపర్‌వైజర్ రాజేష్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

విద్యార్థుల అభ్యసన మెరుగకు ఉన్నత విద్యా బోధన



సత్తెనపల్లి: విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు ఉన్నత విద్యాబోధన అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు అభ్యాసన స్థాయిని మెరుగుపరచడం, తప్పులు లేకుండా పదాలు రాయడం వంటి వాటితో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులని..ప్రతి ఒక్కరూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి సాధించే విద్యాబోధన చేయాలన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి చేస్తున్న విశేష కృషికి తగిన విధంగా ఉపాధ్యాయులు చక్కని విద్యాబోధన అందించి, ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళులు



అమరావతి: మహా కవి గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా బుధవారం అమరావతి తల్లం బ్రహ్మయ్య స్మారక భవనంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఆయనకు నివాళులర్పించారు. ప్రజాసంఘాల కన్వీనర్ బి.సూరిబాబు మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తిని గౌరవించాలని, మనుషుల మధ్య కుల, ఆర్థిక అసమానత లేని సమాజం రావాలన్నారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మండల కార్యదర్శి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎస్కే రఫీ, ఎం సుబ్రహ్మణ్యం, నవీన్, వెంకటేశ్వరరాజు, పి.సత్యనారాయణ, ఎస్డీ మోహిదీన్ వలి పాల్గొన్నారు.

క్రికెట్ జిల్లా జట్టుకు నార్నెపాడు విద్యార్థి ఎంపిక



నార్నెపాడు(ముప్పాళ్ళ): ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-17 క్రికెట్(టెన్నిస్ బాల్) జట్టుకు నార్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థి జెల్ది రవితేజ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వి.రమేష్ బుధవారం తెలిపారు. ఈ నెల 26న పేరేచర్లలోని ఇంటెల్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనపరచి, జిల్లా జట్టులో స్థానం సంపాదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రవితేజను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు జి.నరసింహారావు, ఉపాధ్యాయులు కె.వెంకటరెడ్డి, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ

పెదకూరపాడు: క్రోసూరు జెడ్పీ పాఠశాల మైదానంలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి అండర్-17, 14 స్కూల్ గేమ్స్ ఎంపికల్లో పెదకూరపాడుకు సెయింట్ అన్స్ స్కూల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఖోఖోలో అండర్-17 విభాగంలో పింకీ, ఆఫ్రిన్, ఆస్మిత, కరిష్మా, లూర్దురాణి, జహ్నవి విజేతలుగా నిలిచారు. అండర్-14 విభాగంగలో భవ్యజ్యోతి, నానియోగేశ్వరి, ప్రభుకుమార్, శారోన్‌లు విజేతలుగా నిలిచారు. వారిని ప్రధానోపాధ్యాయులరాలు సిస్టర్ జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

స్థానికం..అద్వితీయం

- ప్రాదేశిక పాలనకు రెండేళ్లు
- సీఎం వైఎస్ జగనన్న పాలనలో గ్రామాల్లో సంక్షేమం
- గర్వంగా భావిస్తున్న ప్రజాప్రతినిధులు
- మెరుగ్గా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు



సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం

సత్తెనపల్లి: ప్రజలు తమ అవసరాలను, సమస్యలను చెప్పుకునే అవకాశం స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారానే సాధ్యపడుతుంది. రాష్ట్రంలో రెండేళ్ల క్రితం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరిగాయి. రెండేళ్ల పాలన అనుభం తమను ప్రజలకు మరింత దగ్గర చేసిందని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల పాలనా తీరుపై ఈ కథనం ...

పరిషత్ ఎన్నికల నేపథ్యమిదీ..

పరిషత్ ఎన్నికలకు 2020లో నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ కోవిడ్ ప్రభావంతో రద్దు చేశారు. తిరిగి 2021 ఏప్రిల్ 8న ఎన్నికలు నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికలు పూర్తయినప్పటికీ ప్రతిపక్షాలు కోర్టును ఆశ్రయించడంతో కౌంటింగ్ ప్రక్రియ నిలిచిపోయింది . 2021 సెప్టెంబర్ 19న ఓట్ల లెక్కింపు చేపటారు. 24న సభ్యులు ప్రమాణ స్వీకారం చేయడంతో.. పరిషత్ పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి.

పెరిగిన మహిళా ప్రాధాన్యత

నియోజకవర్గంలో మహిళా ప్రాతినిధ్యానికి, సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. జెడ్పీటీసీ సభ్యుల్లో సత్తెనపల్లి రూరల్ ఎస్సీ మహిళ, ముప్పాళ్ల జనరల్ మహిళ, రాజుపాలెం జనరల్ మహిళ, నకరికల్లు బీసీ జనరల్ సామాజిక వర్గాలకు చెందిన ప్రతినిధులు జెడ్పీటీసీలుగా ఉన్నారు. ఎంపీపీ స్థానాల్లో సత్తెనపల్లి రూరల్ బీసీ మహిళ, ముప్పాళ్ళ జనరల్ మహిళ, రాజుపాలెం బీసీ మహిళ, నకరికల్లు ఎస్టీ మహిళ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి సత్తెనపల్లి రూరల్ మండలంలో 20, ముప్పాళ్ళలో 12, రాజుపాలెంలో 13, నకరికల్లు మండలంలో 18 స్థానాలు ఉండగా.. నియోజకవర్గం మొత్తం 63 ఎంపీటీసీ స్థానాల్లో వివిధ సామాజికవర్గ ప్రజా ప్రతినిధులు సేవలందిస్తున్నారు. 63 ఎంపీటీసీ స్థానాలకు గాను 11 వైఎస్ఆర్ సీపీ మద్దతుదారులు ఏకగ్రీవం అయ్యారు. మిగిలిన 52 స్థానాల్లో ఎన్నికలు జరగగా..48 స్థానాలను వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. 4 స్థానాల్లో ఇతరులు గెలిచారు.



పాకాలపాడు సచివాలయంలో సేవలు అందిస్తున్న ఉగ్యోగులు

ప్రజలతో మమేకం..

ప్రస్తుత పరిషత్ పాలక వర్గాలు తమ రెండేళ్ల పాలనంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొనసాగుతోంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారాన్ని చేపట్టిన వెంటనే ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేశారు. దీంతో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలందరూ గర్వంగా భావిస్తున్నారు. నెల నెలా పింఛను సక్రమంగా, పారదర్శకంగా అందిస్తున్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, పాలసేకరణ కేంద్రాల భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆసుపత్రులు, పాఠశాల భవనాలు మెరుగు పడడంతోపాటు వాటి నిర్వహణ మెరుగైంది. అన్ని వర్గాల ప్రజలకు ప్రజా ప్రతినిధులు సమక్షంలో సంక్షేమం అందుతోంది.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి

సత్తెనపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని, స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్‌పర్సన్ డి. నాగ వెంకటలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో స్వచ్ఛ భారత్ పై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత, పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేసి, ప్రాముఖ్యతను ప్రజలకు చాటి చెప్పాలన్నారు. కోర్టు పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉందని న్యాయమూర్తికి న్యాయవాదులు ఫిర్యాదు చేశారు. సత్తెనపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కడియాల ప్రశాంతి, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి తాషిద్ హుస్సేన్, బార్ అసోసియేషన్ కార్యదర్శి చిన్నం మణిబాబు, ప్రభుత్వ న్యాయవాది బాలిషేద్, న్యాయవాద గుమస్తాల సంఘ అధ్యక్షులు మర్రి నరసింహారావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక భాధ్యత

అమరావతి: ప్రపంచ పర్యాటక దినోత్సవం, స్వచ్ఛత హి సేవ కార్యక్రమం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి అమరేశ్వరస్వామి దేవస్థానం వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీపీ మేకల హనుమంతరావు, మండలాధికారులు పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు పర్యాటక శాఖ అభివృద్ధి గురించి, స్వచ్ఛత హి సేవ కార్యక్రమానికి సంబంధించిన నినాదాలు చేసుకుంటూ మద్దూరుడౌన్ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్ మీదుగా అమరేశ్వరస్వామి దేవస్థానం వరకు చేరుకున్నారు. మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత హి సేవ ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ హనుమంతరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సారథ్యంలో పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అమరావతి చారిత్రకంగా, సాంస్కృతికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో అమరావతి ప్రాచీన నాగరికతకు అలంబన గా నిలిచిందన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి, తహసీల్దారు విజయశ్రీ, ఎంఈఓ శివబాబు, ఈవోపీఆర్డీ గంగాధర్, కార్యదర్శి నాగరాజు, టూరిజం శాఖ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మానవహారంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపికలు



స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17, అండర్ 14 బాలబాలికల విభాగాల్లో (అథ్లెటిక్స్) ఆటల పోటీలు క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం జరిగాయి. ఆటల పోటీలను జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, ఎంపీపీ పి.కోటయ్య ప్రారంభించారు. 100 మీటర్ల పరుగు పందెంలో అండర్ 17 విభాగంలో అమరావతి ఎస్ఆర్‌కే హెచ్ స్కూల్ నుంచి పి.ముబీన్ ప్రథమ స్థానం , క్రోసూరు జెడ్పీ పాఠశాల విద్యార్థి షేక్ నజీర్ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో పాపాయపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థిని బి.అనూషా ప్రథమస్థానం, అచ్చంపేట జెడ్పీ పాఠశాల విద్యార్థిని ఎం.రీమా గ్రేస్ ద్వితీయస్థానం లో నిలిచారు. అదేవిధంగా అండర్ 17 విభాగం లాంగ్ జంప్‌లో బాలుర విభాగంలో అమరావతి, ఎస్ఆర్‌కేహెచ్ స్కూల్ విద్యార్థి పి.ముబీన్ ప్రథమస్థానం, క్రోసూరు జెడ్పీపాఠశాల విద్యార్థి ఎస్‌కే నజీర్ ద్వితీయస్థానంలో నిలిచారు. అండర్ 17 విభాగం షాట్ పుట్‌లో క్రోసూరు జెడ్పీ పాఠశాల విద్యార్థి ఎస్కే నజీర్ ప్రథమస్థానంలో నిలిచారు. బాలికల షాట్ పుట్ విభాగంలో క్రోసూరు కేజీబీవీ డి.శివపార్వతి ద్వితీయస్థానంలో నిలిచారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పందిటి శిరీషా, ఉపాధ్యాయులు చంద్రశేఖరరెడ్డి, చిల్కా సురేష్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

నాగార్జున నగర్‌లో చైన్ స్నాచింగ్

సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జున నగర్‌లో బుధవారం చైన్ స్నాచింగ్ జరిగింది. స్వప్న అనే మహిళ పాఠశాల నుంచి తన పిల్లలను ఇంటికి తీసుకెళ్లేందుకు నడుచుకుంటూ వస్తుండగా.. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు లాగాడు. ఆమె ప్రతిఘటించడంతో గొలుసు సగం తెగి దొంగ చేతిలోకి వెళ్లింది. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపులను అరికట్టాలి



నకరికల్లు: బాలికలపై లైంగింక వేధింపులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధానోపాధ్యారాలు షేక్ షాహీం అన్నారు. మండలంలోని చేజర్ల ఎస్‌పీఎస్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఎవరైనా.. అసభ్యంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు, బంధువులకు, ఉపాధ్యాయులకు, మహిళా పోలీసులకు చెప్పాలని విద్యార్థునులకు సూచించారు. ఫోక్సోయాక్ట్, దివ చట్టం మహిళలకు, బాలికలకు అండగా ఉంటుందని అన్నారు. దిశ యాప్‌ను ప్రతీ ఒక్కరూ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీహెచ్-ఆర్‌జీఎంహెచ్ వలంటీర్, ఉపాధ్యాయురాలు జి.భారతి, గేరా మోహన్‌రావు, చెరుకూరి వెంకటేశ్వరరావు, బత్తుల సుందరరావు, షేక్ గౌస్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో వైద్యాధికారి డి.రమాదేవి

ముప్పాళ్ళ: జగనన్న సురక్ష సర్వేలో భాగంగా ఏర్పాటు చేసే వైద్య శిబిరాలకు టోకెన్‌లు తీసుకున్న వారంతా హాజరయ్యేలా చూడాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి అన్నారు. మండలంలోని మాదల, గోళ్ళపాడు, ముప్పాళ్ళ గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను తహసీల్దారు ఎం.భవానిశంకర్, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డితో కలిసి ఆమె బుధవారం పరిశీలించారు. ఈ నెల 30న గోళ్ళపాడు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో మొదటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో 14 రకాల రక్త పరీక్షలు, 105 రకాల మందులను ఉచితంగా అందిస్తారని చెప్పారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సూపర్‌వైజర్లు పీటర్‌డేమియన్, జోస్పిన్‌రాణి, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గి స్టోన్ కార్వింగ్‌కు ఉత్తమ ప్రతిభా పురస్కారం



పర్యాటక శాఖ మంత్రి రోజా చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న చెన్నుపాటి

దుర్గి: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగంలో అందించే ఉత్తమ ప్రతిభ పురస్కారాలకు గాను దుర్గి స్టోన్ కారివ్వింగ్‌కు ప్రతిభ పురస్కారం దక్కింది. బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక శాఖామంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నట్లు దుర్గి నాగార్జున శిల్పశాల నిర్వాహకుడు చెన్నుపాటి శ్రీనివాసరావు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాముఖ్యత కల్పిస్తూ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించటాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గి క్వారీలో లభిస్తున్న స్టోన్ కార్వింగ్‌కు పర్యాటక రంగంలో ఉత్తమ ప్రతిభ పురస్కారం లభించటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుర్గి స్టోన్‌కు మంచి గుర్తింపు రావటానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పలువురు అభినందించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

కల్తీ ఆహార పదార్థాలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న హరిబాబు

సత్తెనపల్లి: కల్తీ ఆహార పదార్థాలు మార్కెట్‌లో రాజ్యమేలుతున్నాయని, విద్యార్థులు వాటిపై అవగాహన కలిగి ఉండాలని సీపీఐ జాతీయ ఉపాధ్యక్షుడు డా, చదలవాడ హరిబాబు అన్నారు. పట్టణంలోని ప్రగతి సీబీఎస్ఈ స్కూల్‌లో ప్రగతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ మక్కెన అచ్చయ్య అధ్యక్షతన కల్తీ ఆహార పదార్థాలపై బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్రైడ్‌రైస్, నూడిల్స్, మంచూరియా తయారీలో టేస్ట్ సాల్ట్ వినియోగం ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమన్నారు. దాని వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతిని క్యాన్సర్ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ మెంబరు బీరాల నాగేశ్వరరావు, సీసీఐ ఏపీ చాప్టర్ జాయింట్ సెక్రటరీ వల్లెం లక్ష్మీచెన్నకేశవరావు, కరస్పాండెంట్ మక్కెన పద్మజ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీత రచనలో పిడుగురాళ్ల కవికి ద్వితీయ బహుమతి



పిడుగురాళ్ల: మండల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గీత రచన పోటీలకు ఆహ్వానించారు. ఈ పోటీల్లో మొత్తం 285 మంది కవులు వారి గీతాలను ఆన్‌లైన్ ద్వారా మండలి ఫౌండేషన్‌కు పంపించారు. వీరిలో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వైహెచ్‌కే మోహన్‌రావుకు విరబూసిన మల్లె వనం గీత రచనకు ద్వితీయ బహుమతి లభించింది. దీంతో పట్టణంలోని పలువురుప్రముఖులువైహెచ్‌కే మోహన్‌రావునుఅభినందించారు.

ప్రతి పథకాన్ని ప్రజలకు చేరవేయండి



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అధికారులు, వైద్యులు

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అన్ని సచివాలయాల పరిధిలో సర్వేను విజయవంతం చేసేలా కృషి చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం నుంచి అన్ని మండలాల పురపాలక సంఘాలతో వివిధ పథకాలపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష సర్వేతో పాటు గృహ నిర్మాణ పథకం, డ్వాక్రా సంఘాలకు చేయూతతో పాటు పలు పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రతి ఒక్కరికీ అందించేందుకు అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ఆయా కమ్యూనిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా సచివాలయాలతో సమన్వయం చేసుకొని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ ఈవీ రమణబాబు, వైద్యులు, ప్రాథమిక కేంద్రాల వైద్యులు, సిబ్బంది, సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.

నిందితులకు ఉరి శిక్ష విధించాలి



సత్తెనపల్లి: చిత్తూరు జిల్లా వేణుగోపాలపురం గ్రామంలోని వడ్డెర సామాజిక వర్గానికి చెందిన ఇంటర్ విద్యార్థినిని క్రూరంగా హత్య చేసిన నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా విచారణ జరిపి, వెంటనే ఉరి శిక్ష విధించాలని సత్తెనపల్లి వడ్డెర సంఘం ప్రెసిడెంట్ వేముల వరప్రసాదరావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో తాలూకా సెంటర్‌లోని వడ్డెర సత్తెన్న విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారికి బుధవారం వినతి పత్రం అందించారు. వడ్డెర సంఘ నాయకులు చెంబేటీ శివరామక్రిష్ణ, రాజుపాలెం ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, వడ్డెర, బీసీ సంఘ నాయకులు చల్లా పుల్లారావు, కొమెర శివ శంకర్, పల్లపు అంకమ్మరావు, పల్లపు లక్ష్మయ్య, చల్లా శ్రీనివాసరావు, బత్తుల సాంబశివరావు, పాపా రావు, వెంకటేశ్వర్లు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కృష్ణకు కన్నీటి వీడ్కోలు


నివాళులర్పించిన నేతలు, కుటుంబ సభ్యులు



కృష్ణ భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌తో ఐదుగురు వ్యక్తులకు అవయవదానం చేసిన విద్యార్థి కట్టా కృష్ణ భౌతికకాయం మంగళవారం రాత్రి శాంతినగర్‌లోని మృతుడి నివాసానికి చేరుకుంది. బుధవారం కట్టా కృష్ణ భౌతిక కా యన్ని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, మాజీ సొసైటీ చైర్మన్ తోట బ్రహ్మస్వాములు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చి నివాళులు అర్పించారు. విద్యార్థి స్నేహితులు, బంధువులు శోకసంద్రంలో మునిగి పోయారు. అవయవదానంతో పలువురికి కొత్త జీవితం ప్రసాదించిన కృష్ణ, కుటుంబ సభ్యుల త్యాగనిరతిని కొనియాడారు. అశ్రునయనాలతో కట్టా కృష్ణ అంతక్రియలు బుధవారం పూర్తి చేశారు.

సమసమాజ నిర్మాణమే జాషువా ఆశయం



మాట్లాడుతున్న డాక్టర్ స్వర్ణలతాదేవి

నరసరావుపేట ఈస్ట్: సామాజిక అసమానతలను తన సాహిత్యంతో ఖండించి సమ సమాజ స్థాపనే లక్ష్యంగా జాషువా సాహితీ ప్రక్రియ కొనసాగిందని దళిత రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఎం.స్వర్ణలతాదేవి తెలిపారు. పల్నాడు రోడ్డు లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సాయంత్రం విశ్వకవి గుర్రం జాషువా 128వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.హనుమంతయ్య అధ్యక్షతన జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ స్వర్ణలతాదేవి మాట్లాడుతూ, సామాజిక వాస్తవికతలో జీవించి, సాహిత్యంలో ప్రజాస్వామ్యాన్ని స్వాగతించి తద్వారా సమ సమాజాన్ని జాషువా కోరుకున్నారని వివరించారు. కొందరికే పరిమితమైన పద్య ప్రపంచాన్ని సామాజిక అంశాలతో సామాన్యులకు పరిచయం చేసి విశ్వకవిగా గుర్తింపు పొందారని వివరించారు.

రైతులకు భూహక్కు పత్రాలు మంజూరు

శావల్యాపురం: రీసర్వే పనులు పూర్తి అయిన రెవెన్యూ గ్రామాల్లోని రైతులకు భూ హక్కు పత్రాలు మంజూరైనట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు తెలిపారు. వేల్పూరు రెవెన్యూ గ్రామ పరిధిలో 2539 మంది రైతులకు భూహక్కు పత్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అలాగే మండలంలోని పిచికలపాలెం -1214, పోట్లూరు-2242 మంది రైతులకు భూహక్కు పత్రాలు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే మండలంలోని కనమర్లపూడి రెవెన్యూ గ్రామపరిధిలో 1434 మంది రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారన్నారు. త్వరలో మంజూరైన రెవెన్యూ గ్రామా ల్లోని రైతులకు భూహక్కు పత్రాలను అందజేస్తామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఉన్నారు.

కుంగ్‌ఫూ పోటీలలో పేట విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేటటౌన్: సెప్టెంబ ర్ 21వ తేదీ తెలంగాణా రా ష్ట్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీలలో తమ అకాడమీ విద్యార్థులు 10 బంగారు పతకాలు సాధించటం అభినందనీయ మని న్యూషావలిన్ కుంగ్ ఫూ అకాడమీ మాస్టర్ బత్తుల విక్రమ్ చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం సీఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ అత్యవసరమని చెప్పారు. మానసిక ఉల్లాసానికి, వికాసానికి, శారీరక దృఢత్వానికి మార్షల్ ఆర్ట్స్ దోహదపడతాయన్నారు. మార్షల్ ఆర్ట్స్‌కు వయసుతో సంబంధం లేదని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ కుంగ్ ఫూ మాస్టర్ ఎస్‌కె దరియావలి, యడ్ల సురేష్, పాలపాటి నాగరాజు, కొప్రపాటి రాంబాబు, రబ్బాని, దుర్గా ప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరుఅందించటమే లక్ష్యం

చిలకలూరిపేట: ప్రతి ఇంటికీ తాగునీరు అందించటమే లక్ష్య మని జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ పి.కిరణ్‌కుమార్ చెప్పా రు. మండలంలోని పోతవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జేజేఎం ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందరికీ పరిశుభ్రమైన నీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా హర్ ఘర్ జల్ (ప్రతి ఇంటికీ నీరు) కార్యక్రమం చేపట్టాయని చెప్పారు. ఈ కార్యక్రమం కింద పోతవరం గ్రామం ఎంపికై ందని వివరించారు. దీని ద్వారా గ్రామంలో 480 గృహాలకు నీటి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అబ్దుల్లాబాషాకు హర్‌ఘర్ జల్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, జేజేఎం డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ తేజ్ సంగీత్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.